క్లుప్తంగా

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామివారు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన ఉష, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి స్వామి వారికి ఆదివారం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూర్యదేవుడి దర్శనానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, భోజన సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

ఘనంగా లలితా సహస్రనామ పారాయణం

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని గౌరిమ్మ తల్లి ఆలయం వద్ద మహిళలు లలిత సహస్రనామ పారాయణం, భజనలు చేశారు. ఆదివారం ఆలయం వద్ద అమ్మవారి కి ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారి అలంకరించారు. స్థానిక మహిళలు అమ్మవారి భజనలు, లలిత సహస్త పారాయణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలోని బురదకవి సత్య త్రివేణి, ఆలయం కమిటీ సభ్యులు నిల్లా నాగేశ్వరరావు, అంకం శివలింగం, మత్సా రవి, నిల్లా సత్తి బాబు, ఇనుమర్తి నందికేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మిడ్డే మీల్స్‌లో పెరుగు వితరణ



మధ్యాహ్నం భోజన పథకంలో విద్యార్థులకు పెరుగు అందిస్తున్న ఉపాధ్యాయులు

రంగంపేట: ప్రస్తుతం ఎండలు మండుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఎండ వేడిమిని అధిగమించేందుకు మధ్యాహ్న భోజన పథకంలో దాతలు సహాయంతో పెరుగు అందిస్తున్నట్టు స్థానిక మండల ప్రజా పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మడికి సత్యనారాయణ తెలిపారు. విద్యా కమిటీ కో-ఆప్షన్ సభ్యుడు గోలి దొరబాబు, విశ్రాంత ఉద్యోగి బొల్లి రాంబాబు ఆర్థిక సహాయంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి 23వ తేదీ వరకు ప్రతి రోజు పెరుగు విద్యార్థులకు భోజనంలో పెరుగు అందిస్తున్నామన్నారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయులు కె.సత్యనారాయణ, ఎం.శ్రీనివాస్ కూడా పెరుగు సమకూర్చుతున్నారని చెప్పారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ప్రశాంతంగా నిర్వహించండి



దోసకాయలపల్లిలో మాట్లాడుతున్న సీఐ సత్యకిషోర్

కోరుకొండ: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని ప్రశాంతంగా నిర్వహించాలని కోరుకొండ సీఐ సత్యకిషోర్ తెలిపారు. ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లో అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులను ఆయన కలిశారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఎటువంటి ఘర్షణలు, అవాంఛనీయమైన సంఘటనలకు తావివ్వకుండా నిర్వహించుకోవాలన్నారు. కోరుకొండ, దోసకాయలపల్లి, గాడాల, బూరుగుపూడి, కోటికేశవరం, కణుపూరు తదితర గ్రామాలకు చెందిన ఉత్సవ నిర్వాహకులను ఆయన కలిశారు. ఆయనతో పాటు కోరుకొండ పోలీసులు పాల్గొన్నారు.

సాహితీవేత్తలకు సత్కారం



నారాయణరావు,సందీప్ శర్మలను సత్కరించిన దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: రచయితల సమితి ఆధ్వర్యంలో నగరంలో శ్రీ కందుకూరి వీరేశలింగం పురమందిరం (టౌన్ హాలు)లో సాహితీవేత్త, రచయిత డాక్టర్ అరిపిరాల నారాయణరావు, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ తాతా సందీప్ శర్మలకు సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్కార గ్రహీత నారాయణరావు మాట్లాడుతూ ఆంధ్ర కేసరి కళా సమితి ద్వారా తాము చేసిన అనేక సత్కార్యాలు, కందుకూరి వీరేశలింగంపై పుస్తకం తేవడంలో చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. గతంలో తాను నిర్వహించిన అనేక సభలు ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు రావాలని కోరారు. డాక్టర్ తాత సందీప్ శర్మ మాట్లాడుతూ గతంలో పుష్కరాల్లో పది రోజులు తాను నిర్వహించిన సభలలో సాధక బాధకాల వివరించారు. ఈ కార్యక్రమంలో కళా గౌతమి వ్యవస్థాపకులు డాక్టర్ బీవీఎస్ మూర్తి, అధ్యక్షుడు డాక్టర్ పీవీబీ సంజీవరావు, కళాగౌతమీ కార్యదర్శి డాక్టర్ బీహెచ్ వీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వేసవి దుక్కులు.. భూమికి మేలు

- పెరగనున్న భూసారం, పంట దిగుబడి
- తగ్గనున్న తెగుళ్ల బెడద
- బహుళ ప్రయోజనాలు ఉంటాయంటున్న వ్యవసాయాధికారులు

రాజానగరం: వ్యవసాయ భూమి సారంగా ఉంటేనే వేసిన పంటలు ఆశించిన దిగుబడి లభిస్తుంది. అలాగని అదే భూమిలో వరుస పెట్టి పంటలు పండిస్తూ భూసారాన్ని విస్మరిస్తే కాలక్రమంలో ఆయా భూములు నిస్సారమయ్యే ప్రమాదం ఉంది. అందుకనే మన పూర్వీకులు ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు పండించిన భూముల్లో వేసవిలో దుక్కులు చేపట్టి, భూసారాన్ని కాపాడుకునే ప్రయత్నం చేసేవారు. ఆధునిక సమాజంలో భూముల్లో పంటలు పండిస్తూ దిగుబడి తీసుకునేందుకు ఎక్కువ మంది రైతులు చూస్తున్నారు తప్ప, భూసారాన్ని వృద్ధి చేయడానికి ప్రయత్నించడం లేదు. రబీ పంట తరువాత వేసవిలో ఆయా భూముల్లో దుక్కులు చేపట్టడం వలన బహుళ ప్రయోజనాలున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వ్యవసాయంపై మక్కువ, ఆసక్తి ఉన్న రైతులు కొంతమంది పూర్వీకుల పద్ధతులను ఆనుసరిస్తూనే అధిక దిగుబడులు సాధించే దిశగా అడుగులు వేస్తున్నారు.



నరేంద్రపురంలో వేసవి దుక్కులు చేస్తున్న దృశ్యం

మన పూర్వీకులు ఇలా..

మన పూర్వీకులు ఏ పని చేసినా అప్పటి ప్రయోజనాలతోపాటు భవిష్యత్తు గురించి కూడా ఆలోచించేవారు. ముఖ్యంగా వ్యవసాయంలో భూసారాన్ని కాపాడుకుంటూ నాణ్యమైన పంటలు పండిచే దిశగా అడుగులు వేసేవారు. ఖరీఫ్ సీజన్‌కి సమాయత్తమయ్యే పొలాలలో వేసవిలో దుక్కులు చేపట్టి భూసార పరిరక్షణకు చర్యలు తీసుకునేవారు. కాలక్రమంలో అన్నదాతలు 'ఆధునికత' పేరుతో బిజీ అయిపోయి, వేసవి దుక్కులు చేపట్టడం చాలా వరకూ మానేశారు. అయితే మెట్ట ప్రాంతంలో ముఖ్యంగా వరి సాగులో ముందుండే రాజానగరం మండలం, నరేంద్రపురం, తూర్పుగానుగూడెం, కలవచర్ల, వెలుగుబంద, గండేపల్లి మండలం మురారి, గండేపల్లి తదితర గ్రామాలలో రైతులు చాలా మంది వర్షాలు కురిసిన వెంటనే వేసవి దుక్కులు చేస్తుంటారు. అయితే వేసవి ఎండల తీవ్రత అధికంగా ఉన్న ప్రస్తుత తరుణంలో దుక్కులు చేయడం ఎలాగని చాలా మంది రైతులకు సందేహాలు రావొచ్చు. అయితే బోర్లు, సాగునీటి సదుపాయాలు ఉన్నవారు ఇప్పటికే వేసవి దుక్కులు ప్రారంభించారు. మిగిలిన వారు వర్షాలు పడిన వెంటనే చేపట్టవచ్చు. వేసవిలో దుక్కులు చేపట్టి, పశువుల పెంట వేయడం ద్వారా ఆయా భూములలో భూసారం వృద్ధి చెంది, తద్వారా సాగు చేసే పంటలు మంచి దిగుబడిని అందిస్తాయి.

వేసవి దుక్కులు - ప్రయోజనాలు

- వేసవిలో పొలాలను దుక్కు చేయడం వలన ఆయా పొలాలలో పెరిగిన గడ్డి నశించిపోవడం తోపాటు వరి మోళ్లు కుళ్లి భూమిలో కలిసిపోయి ఎరువులుగా మారతాయి.
- భూమిలో ఉండే వివిధ రకాల పురుగులు పైకి రావడం వలన వాటిని పక్షులు ఆహారంగా తీసుకుని, తదుపరి వేసే పంటలకు నష్టం వాటిల్లకుండా నివారిస్తాయి.
- అలాగే పక్షులు ఆహారంగా తీసుకోగా మిగిలిన పురుగులు వేసవి ఎండల తీవ్రతకు చనిపోతాయి. తద్వారా ఆయా పొలంలో పురుగుల ఉధృతి తగ్గుతుంది,
- అలాగే తెగుళ్లకు కారణమయ్యే శిలీంద్రాలు కూడా ఈ ఎండలకు చనిపోడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ విధంగా తరువాత సాగు చేసే పంటలకు తెగుళ్ల బెడద లేకుండా నివారించవచ్చు,
- రైతు ఇదే సమయంలో దుక్కు చేసిన పొలాలలో పచ్చిరొట్ట విత్తనాలను చల్లితే భూమి సారాన్ని కూడా పెంపొందించుకునేందుకు అవకాశం ఉంటుంది.

వేసవి దుక్కులు మంచివి



నూరగా నూరగా రాళ్లు కూడా పిండైపోతుంటాయి. అలాగే మన పొలాలు కూడా విరామం లేకుండా పంటలు పండిస్తూ పోతుంటే వాటిలో సారం కరిగిపోయి, నిస్సారంగా తయారవుతాయి. అయితే ఈ సమస్యను నివారించేందుకు పొలాలలో వేసవి దుక్కులు చేపట్టడం ఎంతో అవసరం. రబీ పంట తరువాత అపరాలు సాగు చేసే భూములలో కాకుండా ఖాళీగా ఉంచిన పొలాలలో వేసవి దుక్కులు చేయడం చెడు పురుగులు, శిలీంద్రాలు చనిపోవడంతో పాటు, గడ్డి, గరప కుళ్లి నేల సారవంతంగా తయారవుతుంది. తెగుళ్ల బెడద చాలా వరకు ఉండదు. తద్వారా దిగుబడి బాగుంటుంది.

– ప్రగడ రాంబాబు, రైతు, నరేంద్రపురం

పూర్వీకులకు ముందు చూపుతో



పూర్వీకులు ఏ పని చేసినా ముందు చూపుతో చేసేవారు. వ్యవసాయంలో వారు అనుసరించి అనేక పద్ధతులు నేటికీ ఆచరణీయంగానే ఉన్నాయి. అటువంటి వాటిలో మన పంటలు పండిచే పొలంలో వేసవి దుక్కులు చేపట్టడం ఒకటి. దీని వలన ఆయా భూమిలో ఉండే చెత్తాచెదారాలు, కలుపులు అన్నీ పెకలించబడి, ఆపై కురిసే వర్షపు చినుకులకు అవి కుళ్లి భూసారం పెరుగుదలకు తోడ్పడతాయి. అదే సమయంలో మనం కూడా పశువుల పెంటను చల్లితే మరింత సారవంతమవుతాయి.

– పాలచర్ల వెంకటరమణ, రైతు, మురారి

గాలివాన బీభత్సం



ఈదురు గాలుల బీభత్సానికి నేలరాలిపోయిన మామిడి కాయలు

రంగంపేట: గాలివాన సృష్టించిన బీభత్సానికి మామిడి రైతులు కుదేలయ్యారు. మండలంలో శని వారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఆరుగాలం శ్రమించిన మామిడి రైతుల ఆశలు ఆవిరయ్యాయి. భారీగా వీచిన ఈదురు గాలులకు మామిడి కాయలు నేల రాలాయి. ఈనెలాఖరు వరకు ఉంటే మంచి దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం కాయలు టెంక కట్టేదశలో ఉన్నాయని ఈ సమయంలో గాలివానకు నేల రాలాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటి వరకు తోటలకు నీరు పెట్టి, మందులు పిచికారీ చేసి కాపాడుకుంటూ వచ్చామని ఇప్పుడు ప్రకృతి కన్నెర్ర చేయడంతో చేతికందివచ్చే సమయంలో కాయలు నేలపాలై ఎందుకు పనికిరాకుండా పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉరుములు మెరుపులతో కూడిన గాలివానకు వడిశలేరులో పిడుగుపడి కొబ్బరిచెట్టు దగ్ధమైంది.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ

సీతానగరం: ముగ్గళ్ల గోదావరి మాత విగ్రహం వద్ద అంబేడ్కర్ మెగా క్రికెట్ టోర్నమెంట్‌లో నియోజకవర్గంలోని పలు క్రికెట్ జట్లు హోరాహోరీగా ఆదివారం తపలడ్డాయి. ఇనుగంటివారిపేట టీమ్‌పై పాలచర్ల టీమ్ విజయం సాధించింది. అలాగే రఘుదేవపురం టీమ్‌పై సీతానగరం, రాజంపేట టీమ్‌పై గుమ్మళ్లదొడ్డి విజయం సాధించాయి. ఇనుగంటివారిపేట సన్నీ టీమ్‌పై వెదుళ్లపల్లి టీమ్ విజయం సాధించింది. ప్రతి రోజు నాలుగు మ్యాచ్‌లు నిర్వహించినట్టు నిర్వాహకులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ పీఏసీలో తూర్పుగోదావరి జిల్లాకి ప్రాధాన్యం

పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి



పెదపూడి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ(పీఏసీ) నియామకంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు అత్యంత ప్రాధాన్యమివ్వడంపై ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, అనపర్తి ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆయన ఆదివారం అనపర్తిలో మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార సీపీలో అత్యున్నతమైన కమిటీ పీఏసీ అని, ఈ కమిటీలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు ముద్రగడ పద్మనాభంలకు స్థానం కల్పించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ నియామకాలు పార్టీ నాయకులు, కార్యకర్తలను మరింత ఉత్సాహపరుస్తుందన్నారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తారన్నారు. అలాగే బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా కొత్తపేట మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ చిర్ల జగ్గిరెడ్డిని నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. సామాజిక వర్గాల సమతుల్యతతో చేపట్టిన నియామకాలు పార్టీ ప్రతిష్టకు మరింత దోహదం చేస్తాయన్నారు. ఈ నియామకాలు చేపట్టిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. అలాగే పదవులు పొందిన వారికి అభినందనలు తెలియజేస్తున్నట్లు కృష్ణారెడ్డి తెలిపారు.

నా కుటుంబంపై లేనిపోని వ్యాఖ్యలు చేస్తే సహించను

- హాస్పిటల్‌ను గ్రాసిమ్ సంస్థ సొమ్ముతో నిర్మించినట్టు దమ్ముంటే నువ్వు నిరూపించు?
- ఎమ్మెల్యే నల్లమిల్లిపై ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: తన కుమారుడు గౌతమ్‌రెడ్డి ప్రయోజకుడని, అతనిపై లేనిపోని వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకునేదే లేదంటూ అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అంటూ వైఎస్సార్ సీపీ అనపర్తి నియోజకవర్గం కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ధ్వజమెత్తారు. అనపర్తి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఆదివారం మీడియాతో మాట్లాడారు. తమ కుమారుడు రాజమహేంద్రవరంలో గౌతమ్ యురాలజీ కిడ్నీ సెంటర్ హాస్పిటల్‌ను సుమారు రూ.10 కోట్ల బ్యాంకు రుణం తీసుకుని నిర్మించామని, ఈ హాస్పిటల్‌ను గ్రాసిమ్ సంస్థ వారు నిర్మించి ఇచ్చారని ఎమ్మెల్యే నల్లమిల్లి చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లికి మతి భ్రమించి మాట్లాడుతున్నారని, మా నాన్న హయాం నుంచి తాము అనపర్తి ప్రాంతంలో ఆదాయ పన్నులు చెల్లిస్తున్న ఉన్నతమైన కుటుంబామని, తమకు ఎలాంటి అక్రమాలు చేయాల్సిన అవసరం లేదన్నారు. మేము మాకష్టాన్ని తెలివిని నమ్ముకున్నామని వివరించారు. అడ్డదారుల్లో సంపాదన, అవినీతి చేయడం అనేది మీకు, మీకుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. నాకుమారుడు గౌతమ్‌రెడ్డి ఒక గొప్ప డాక్టర్‌గా మంచి పేరు తెచ్చుకున్నారని, అతని మీద అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని అన్నారు. నీకు ఆ అదృష్టం లేదు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అని అన్నారు. అలాగే బ్యాంకు రుణం తీసుకుని హాస్పిటల్ నిర్మాంచమని, ఎందుకు మాకు పడి ఏడుస్తారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. తాను తన కుటుంబం మీలాగ ఎప్పుడు బ్యాంకులకు కోట్ల రూపాయిల రుణాలు ఎగ్గొట్టి ప్రజాధనం లూటీ చేయలేదంటూ ఆరోపించారు. నాపై, నాకుటుంబసభ్యులపై అసత్య ఆరోపణలు, వ్యక్తిగ ఆరోపణలు చేస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యే నల్లమిల్లి, అతని అనుచరులు రాజకీయంగా కాకుండా వ్యక్తిగత విమర్శల్లోకి వెళ్లి తన భార్యను, తన కుటుంబ సభ్యులను వ్యంగ్యమైన పేర్ల పెట్టి మీరు ప్రెస్ మీట్‌లలో సంబోధిస్తున్నారని, మీ కుటుంబాల్లో కూడా ఆడవాళ్లు ఉన్నారని మర్చిపోవద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని మా కుటుంబ సభ్యులను టార్గెట్ చేస్తే వాళ్లకి ఒక కుటుంబం ఉంది అనే సంగతి మర్చిపోవద్దని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు.

ప్రజా సంఘాల సభను జయప్రదం చేయండి



సింగంపల్లిలో సభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రంగంపేట: తొలి సోషలిస్టు, రాజ్య నిర్మాత మార్క్సిస్ట మహోపాధ్యాయుడు వి.ఐ లెనిన్ జయంతిని పురస్కరించుకుని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 22న ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా జరిగే శాంతి ర్యాలీ, సభను జయప్రదం చేయాలని ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు మండల పరిధిలోని సింగంపల్లి గ్రామంలోని చంద్రపుల్లారెడ్డి నగర్‌లో లెనిన్ జయంతి కరపత్రాన్ని ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వల్లూరి రాజబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అడవులను, అడవి గర్భంలోని కనిజ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలనే లక్ష్యంతో, మధ్య భారత అడవుల్లో ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక ఆదివాసీలపై దాడులు నిర్వహిస్తూ మారణ హోమాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. అటవీ హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రశ్నిస్తున్న మేధావులపైన, అభ్యుదయ వాదులపైన, ప్రజా కళాకారుల పైన అర్బన్ నక్సలైట్ల పేరుతో ఉపా చట్టాన్ని ఉపయోగించి నిర్బంధిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా లెనిన్ జయంతి రోజున శాంతి కోసం ఊరూరా వాడవాడలా శాంతి ర్యాలీలు, సభలు జరపాలనే ప్రజా సంఘాల పిలుపులో భాగంగా రైతుకూలీ సంఘం, ఏఐఎఫ్‌టీయూ, పీడీఎస్‌యూ(వి), పీఓడబ్ల్యూ (స్త్రీ విముక్తి), తదితర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆర్‌సిఎస్ నాయకులు చెక్కా సత్తిబాబు, తలుపులమ్మ, రత్నం, పద్మ పాల్గొన్నారు.

నేడే గొల్లాలమ్మ, గోగులమ్మ అమ్మవారి జాతర



ఆరిక రేవులల్లో అమ్మవార్లు ఉన్న ఆలయం



శ్రీ గొల్లాలమ్మ తల్లి అమ్మవారు



శ్రీ గొగులమ్మ తల్లి అమ్మవారు

బిక్కవోలు: ఆరికరేవుల గ్రామంలోని వెలంపేటలో సోమవారం గొల్లాలమ్మ, గోగులమ్మ అమ్మవారి జాతర, మంగళవారం తీర్థం జరుగనున్నాయి. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఆడపడుచులతో సందడి వాతావరణ నెలకొంది. అతి ప్రాచీన, చారిత్రక ఆలయాలకు కొలువైన ఈ దేవాలయాలకు ఒక్కో ప్రత్యేకత ఉంది. ఏ గ్రామంలోని ఒకే దేవతకు మాత్రమే జాతర ఉంటుంది. ఈ గ్రామంలోని ఇద్దరు దేవతలకు ఒక్కసారి జాతర చేయడం ఆనావాయితీగా వస్తోంది. భక్తుల విశ్వాసాలు, స్థానిక ఆచార సంప్రదాయాలతో ముడిపడి మూడు దశాబ్దాలుగా పూజలందుకుంటున్నారు. సోమవారం జరిగే సంబరాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు నాళం శ్రీనివాస్, బొడ్డు వెంకట సూర్యనారాయణ తెలిపారు.

అంబేడ్కర్ జెండాల పంపిణీ

రాజమహేంద్రవరం సిటీ: విశ్వ మేధావి, భారత రత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా 2000 జెండాలను తోరణాలను పంపిణీ చేసినట్లు అంబేడ్కర్ సేవా కేంద్రం (ఆస్క) చైర్మన్ ఎ.రాంబాబు ఆదివారం తెలిపారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులకు ఈ జెండాలను అందించమన్నారు. నగరంలోని అంబేడ్కర్ అభిమానులందరూ సోమవారం ఉదయం విగ్రహాల వద్ద జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కోరారు. మధ్యాహ్నం మూడు గంటలకు క్వారీ మార్కెట్ సెంటర్ నుంచి గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వరకూ ఉత్సవ ర్యాలీలో జెండాలతో పాల్గొని జయప్రదం చేయాలని కోరార. జెండాలో కావలసినవారు స్వయంగా లాలాచెరువులోని అంబేడ్కర్ సేవా కేంద్రంలో సంప్రదించాలన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు



కాపవరంలో ర్యాలీ చేస్తున్న క్రీసు సభ్యులు

పెదపూడి: మండలంలో పలు క్రైస్తవ మందిరాల్లో మట్టల ఆదివారంను ఘనంగా నిర్వహించారు. ఉదయం క్రైస్తవ సోదరులు, చిన్నారులు ఈత చెట్టు మట్టలను చేత పట్టి వాటిని రకరకాల పూలతో అలంకరించి గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేశారు. పెదపూడిలో బేతేలు చర్చిలో పాస్టర్ చూక్కా శామ్యూల్ రాజు దేవ కుమారి దంపతులు, కరకుదురు గ్రామంలో బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ వారా జోసెఫ్ విక్టర్, పాల్ జి.తిలక్ మట్టల ఆదివారం ప్రత్యేకతను క్రైస్తవులకు సందేశాన్ని ఉపదేశించారు. గుడ్‌ఫ్రైడే, ఏసుక్రీస్తును సిలువ వేయడానికి అయిదు రోజుల ముందుగా క్రైస్తవులు ఈ వేడుకలు నిర్వహిస్తారు. అలాగే ఏసుక్రీస్తు ప్రభువు సిలువపై మరణించక ముందు చివరి సారిగా యేరుషలేం దేవాలయ ప్రవేశం చేసిన సందర్భంగా ప్రపంచంలోని క్రైస్తవులందరూ ఈ వేడుక నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

బిక్కవోలు: కాపవరం గ్రామంలోని మట్టల ఆదివారం ర్యాలీ ఘనంగా నిర్వహించారు. త్రినేటి లూథరన్ చర్చ పాస్టర్ బి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఈత కొమ్మలకు ప్రత్యేక పూలు అలంకరించి గ్రామంలోని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీసు పార్థన చేశారు. రాజకుమారుడు వస్తున్నాడు స్వాగతం అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఏసు సందేశం వివరించారు. ఈ కార్యక్రమంలోని తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం

కోరుకొండ: క్రైస్తవులు పవిత్రంగా భావించే మట్టల ఆదివారంను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కోరుకొండ మండలంలోని ఆర్‌సీఎం, లూథరన్, పెంతుకోస్తు చర్చిల్లో ప్రదర్శనలు నిర్వహించారు. ఎస్సార్ నగర్‌లోని ఆర్‌సీఎం చర్చినుంచి, పశ్చిమగానుగూడెంలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చినుంచి ప్రధాన విధులు గుండా క్రైస్తవులు ప్రదర్శనలు నిర్వహించారు. ఈసందర్భంగా రెవరెండ్ ఫాదర్ మాణిక్యం వాక్యసందేశమిచ్చారు.



పెదపూడిలో ఈత మట్టలు చేతపట్టి ఊరేగింపు నిర్వహిస్తున్న బేతేల్ చర్చి క్రైస్తవ చిన్నారులు, యువత

అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి నూతన కార్యవర్గం ఎంపిక



అనపర్తిలో నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

పెదపూడి: స్వామి వివేకానంద స్ఫూర్తితో గత 23 ఏళ్లగా సమాజానికి సేవలు అందిస్తున్న అనపర్తి సేవా సమితి నూతన అధ్యక్షుడిగా ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి తొమ్మిదో సారి ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఆదివారం అనపర్తి ప్రాంతీయ కోళ్ల రైతుల సంక్షేమ సంఘం సెమినార్ హాల్‌లో జరిగిన సర్వసభ్య సమావేశంలో 2025–2026 సంవత్సరానికి సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పడాల సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యక్షులుగా సత్తి వెంకటరెడ్డి, తేతలి సుందర రామారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, పీవై ఎన్‌వై సతీష్, ప్రధాన కార్యదర్శిగా నల్లమిల్లి సుబ్బారెడ్డి, కార్యదర్శులుగా నల్లమిల్లి శ్రీనివాసారెడ్డి, తాడి చంద్రశేఖర్‌రెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి, మల్లిడి శ్రీనివాసారెడ్డి, కోశాధికారిగా దాట్ల ప్రతాప్‌వర్మతో పాటు 30 మంది సభ్యులను ఎన్నుకున్నారన్నారు. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

సీతానగరం: స్థానిక వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఆదివారం స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తుల సమక్షంలో అర్చకులు శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.